





# జై మాతా ది

● వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు ● వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించిన అర్చకులు

**నల్లకుంట:** నల్లకుంటలోని శంకరమఠంలో శారదా శరన్నవరాత్రి ఉత్సవాలు నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం శారదాంబ అమ్మవారు వైష్ణవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూల మాలలు, బంగారు ఆభరణాలతో అలంకరించి అమ్మవారికి స్వర్ణ కమల పూజ, కుంకుమార్చనలు చేశారు. శక్తి గణపతికి ఆదిపూజలు నిర్వహించి, చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. మఠం ప్రాంగణంలోని యాగశాలలో అర్చక స్వాముల మంత్రోచ్చారణల నడుమ 'సహస్రమోదక గణపతి హోమం'నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా నవదాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి కాయలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణహుతి కావించారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది. ఉదయం 10గంటలకు సుధాస్వామి బృందంచే 'సౌందర్య లహరి పారాయణం'జరిగింది. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు అద్వైతసిద్ధి రత్నాకర్త శాస్త్రనిధి బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యం 'దేవీ భాగవతము'పై ప్రవచనాలు ఇచ్చారు.

◆ అనంతరం సుధాస్వామి బృందంచే నిర్వహించిన సౌందర్యలహరి పారాయణ, జగద్గురు విద్యాశంకర మహాస్వామి రచించిన 'శ్రీ కనక దుర్గానంద లహరీ'స్తోత్రం కీర్తన, కుమారి సాయి శరవణ శ్రేయ పన్నాల 'గాయత్రి దరువు కూచిపూల నృత్య ప్రదర్శన' అహూతులను ఆకట్టుకుంది.

**భక్తిశ్రద్ధలతో బాలపూజ**

**నల్లకుంట:** నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో ఆదివారం ఉదయం 'బాలపూజ'నిర్వహించారు. శారదా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ప్రతి రోజు అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమిస్తున్న తరుణంలో ప్రతి ఏటా అమ్మవారి వివిధ వేషధారణలో చిన్నారులను అలంకరించి బాలపూజ నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి విజితా రెడ్డి, భూధాన్ సాగర్‌రెడ్డి, సీహెచ్.మురళీ కృష్ణ, సీహెచ్ లలితా కుమారి, మాతా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బొమ్మిడి శ్రవణ్ కుమార్, సురేష్, సంగీత తదితరులు పాల్గొన్నారు.


శంకరమఠం ఆలయ ప్రాంగణంలో బాలపూజలో పాల్గొన్న చిన్నారులు, మఠం సభ్యులు

**న్యూ రామాలయంలో శ్రీలలితాత్రిపుర సుందరిగా..**

◆ న్యూ నల్లకుంటలోని న్యూ రామాలయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారు శ్రీలలితాత్రిపుర సుందరి అలంకరణలో బక్తులకు కనువిందు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో గల యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. మహోత్సవాల్లో ఐదవ రోజైన సోమవారం అన్నపూర్ణా దేవి అలంకరణ ఉంటుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అమలాపురం గోపాల్ రావు తెలిపారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసుడు, పంచశత వీణాగానరత్న పోపూరి శ్రీనివాస శర్మ, యశస్వినిలచే భక్తి సంగీత కచేరి ఉంటుందని చెప్పారు.

**నేడు ఇంద్రాణి అలంకరణ**

శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజైన సోమవారం శారదాంబ ఇంద్రాణి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని శంకరమఠం నల్లకుంట శాఖ హెడ్ కె.కృష్ణారావు తెలిపారు. సాయంత్రం 7గంటలకు గీతా గణేశన్‌చే యూసీపీఏ విద్యార్థులలో గళ మురళీ (ఈల పాట) విన్యాసం ఉంటుందన్నారు.


చిక్కడపల్లిలోని నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ మండపంలో.. వెంకటేశ్వరస్వామి ఆలయ ఈవో రామాంజనేయులు


బతుకమ్మకుంట అమ్మవారిలో ఆలయంలో భక్తుల పూజలు


జైస్వాల్‌గార్డెన్‌లో అమ్మవారి ప్రాంగణంలో అన్నాదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, నిర్వాహకులు

## కేంద్ర మంత్రికి ఆహ్వానం

**అంబర్‌పేట:** అంబర్‌పేటలో వైభవంగా జరిగే శరన్నవరాత్రి వేడుకలకు హాజరుకావాల్సిందిగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు ఆదివారం ఆహ్వానించారు. ఆదివారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మహంకాళి ఆలయంలో జరిగే వేడుకలతోపాటు ఈ నెల 12 జరిగే దసర వేడుకల్లో పాల్గోన్నాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, పి. జ్ఞానేశ్వర్‌గౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, శంకర్‌గౌడ్, గరిధర్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, రంగంపల్లి రాజు, గడ్డం శ్రీధర్‌గౌడ్, కిషోర్, సుధాకర్ పాల్గొన్నారు.


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న అంబర్‌పేట దేవస్థాన సేవ సమితి ప్రతినిధులు


న్యూ రామాలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

## దేవీ నవరాత్రి మహోత్సవం కరపత్రం ఆవిష్కరణ

9న బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గానసభలో వేడుకలు

**చిక్కడపల్లి:** బ్రహ్మకుమారీస్ చిక్కడపల్లి శాఖ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల మహోత్సవాన్ని 9న చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో సాయంత్రం 6గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జి జయశ్రీ తెలిపారు. ఆదివారం చిక్కడపల్లిలోని బ్రహ్మకుమారీస్ శాఖ కేంద్రంలో ఈ కార్యక్రమానికి సబంధించిన కరపత్రాన్ని జయశ్రీ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఈ మహోత్సవంలో దేవీ రాత్రులు – ఆధ్యాత్మిక రహస్యం, దేవీ నవరాత్రులకు నేటి సమాజానికి గల ఆధ్యాత్మిక సంబంధం గురించి వివరిస్తారని పేర్కొన్నారు. ప్రముఖులచే ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ సంబురాలు ఉంటయాని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్, ప్రతినిధులు రస్మిత, ప్రియాంక, కిషన్, రాజేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని అవిష్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి జయశ్రీ, రస్మిత, ప్రియాంక, కిషన్, రాజేష్, కిషన్


అంబర్‌పేట డివిజన్‌లో అమ్మవారి మండపంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్


గోల్నాకలో శరన్నవరాత్రి వేడుకల్లో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్


ముషీరాబాద్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నేతలు నగేష్‌ముదిరాజ్


వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో శరన్నవరాత్రి పూజలు

# ఒక్కేసి పువ్వేసి చందమామ..


బతుకమ్మ చౌక్‌లో జరిగిన వేడుకల్లో తెలంగాణ సగర మహిళా సంఘం నేతలు

**కవాడిగూడ:** ట్యాంక్‌బండ్‌లోని బతుకమ్మ చౌక్‌లో ఆదివారం రాత్రి తెలంగాణ సగర మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ మాట్లాడుతూ... ప్రపంలోనే ఎక్కడలేని విధంగా పూలను పూజించే సంస్కృతి తెలంగాణ ప్రజల సొంతమన్నారు. తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేందుకు బతుకమ్మ ఉత్సవాలను సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ బతుకమ్మ ఉత్సవాలకు జంటనగరాల నుంచి సగర కులస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా ఆడిపాడటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.


సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద టీపీఎస్‌కే ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

**9న గాంధీనగర్ డివిజన్‌లో బతుకమ్మ సంబరాలు**

**చిక్కడపల్లి:** గాంధీనగర్ డివిజన్‌లో బతుకమ్మ సంబరాలను కార్పొరేటర్ పావని ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నిర్వహిస్తామని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం కార్పొరేట్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాల కార్యనిర్వహణ కమిటీ సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిచంద్ మాట్లాడుతూ.. బతుకమ్మ సంబరాలు గాంధీనగర్‌లోని ఆంధ్రకేఫ్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గాంధీనగర్ డివిజన్‌తో పాటు ముషీరాబాద్ నియోజవర్గం మహిళలందరూ పాల్గొనాలని తెలిపారు.

**15 నుంచి యోగా వాసిష్టంపై ప్రవచనాలు**

**నల్లకుంట:** బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు 3రోజుల పాటు 'యోగా వాసిష్టం(గురుతత్వం)'పై ప్రవచనాలు ఉంటాయని సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచనాలు ఇస్తారని చెప్పారు. ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పాల్గొని గురువుగారి ఆశీర్వచనాలు పొందవచ్చారు.

## తెలుగు గజల్స్‌ను విశ్వవ్యాప్తం చేస్తాం


గజల్ కళాకారులను సత్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** తెలుగు గజల్స్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకు తమ వంతు కృషి చేస్తానని విశ్వపుత్రిక ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయలక్ష్మి పండిట్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్వపుత్రిక ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజల్స్‌పై పలువురు కవులు కవితలను వినిపించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి పండిట్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో కవులు, కళాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.

◆ విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ మాట్లాడుతూ... ప్రజలను త్వరగా ఆకట్టుకునేది గజల్సేనని అన్నారు. ఇలాంటి కవులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలన్నారు. కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ ఎం.నర్సింహప్ప, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లవాడియా, రచయిత భగీరథ, సీనియర్ జర్నలిస్టు ప్రభు, పి.రామసత్యనారాయణ, సూరారం శంకర్, రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆ పిటిషన్ల డిస్మిస్ వెనుక ప్రధాని హస్తం'

**కాచిగూడ:** ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌పైన రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ డిస్మిస్ చేయడం వెనుక ప్రధాని నరేంద్రమోదీ, మాజీ చీఫ్ జస్టిస్ ఎన్.వీ.రమణల హస్తం ఉందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆరోపించారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనువాద పాలకుల విధానాన్ని సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ప్రకటించారన్నారు. రాజ్యాంగ వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పులు ఇవ్వడం జాతీయ జ్యుడిషియల్ స్వతంత్ర వ్యవస్థ కూడా కలుషితం అయిందని అర్థమవుతుందన్నారు. ఈ తీర్పుతో మెజారిటీ దళిత సమాజం ఆందోళన చెందవద్దన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, రేవంత్ రెడ్డి, చంద్రబాబు, ప్రభుత్వాలపై ప్రజా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డిసెంబర్ రెండో వారంలో దళితుల తిరుగుబాటు పేరుతో వర్గీకరణ వద్దు, రాజ్యాధికారం కావాలి అనే నినాదంతో భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా సత్తా చాటాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు.

## 'హైడ్రా'కు చట్టబద్ధతపై హర్షం

**కాచిగూడ:** చెరువులు, ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం 'హైడ్రా' పేరుతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం... దానికి చట్టబద్ధత కల్పించడానికి తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించడంపై ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌పీహెచ్ రంగయ్య తెలిపారు. మూసీ నది వెంబడి పిల్లల ఆట స్థలాలు ఏర్పాటు చేయాలని సూచించారు. హైడ్రాపై రాజకీయ ప్రేరేపిత అడ్డంకులు సృష్టించవద్దని ఆయన కోరారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. 'హైడ్రా'కు రాజకీయ పార్టీలు, ప్రజలు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్విరాన్‌మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

**నల్లకుంట:** రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకు వచ్చిన ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకుని వెళ్లేలోపే మృతి చెందిన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై జె.శ్రీనివాస్ రావు తెలిపిన వివరాలు.. విద్యానగర్ అడిక్‌మెట్ ముస్లిమ్ లేన్‌లో నివాసముండే మహ్మద్ ఖైసర్ ఖాన్(55) పంక్చర్ షాప్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి 10.43 గంటల సమయంలో స్థానికంగా ఉన్న కుమారుడి మెడికల్ షాప్‌కు బయలుదేరాడు. విద్యానగర్ మెయిన్ రోడ్డులో గల ఎస్వీఎస్ కళాశాల వద్ద రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో సమీపంలోని రిలయన్స్ మాల్ రోడ్డు నుంచి వేగంగా దూసుకు వచ్చిన ఓ కారు (టీఎస్11ఈఎల్1270) అతడిని ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన ఖైసర్ తల, కాళ్లకు తీవ్రమైన గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అతన్ని చికిత్సల కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతడిని పరీక్షించిన అక్కడి వైద్యులు మృతి చెందాడని చెప్పారు. ఆదివారం మృతుడి బావమరిది మెకానిక్ మహ్మద్ ఆయూబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అక్కడి సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు.

## ఫ్లెక్సీ ప్రింటర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

**పంజగుట్ట:** రాష్ట్రంలోని ఫ్లెక్సీ ప్రింటర్స్ యజమానులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఫ్లెక్సీ ప్రింటర్స్, ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఎన్. నరేష్ కుమార్ తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మాజీ అధ్యక్షులు అన్సారీ ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని యూనిట్లల్లో ఉన్న ఫ్లెక్సీ ప్రింటర్స్ నిర్వాహకులు, ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం అధ్యక్షులు ఎన్.నరేష్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ కోట్ల, ఉపాధ్యక్షులు ఎ.శ్రీనివాస్, కోశాధికారి ఎమ్.డి.ఖదీర్, సహాయ కార్యదర్శి వాసు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎమ్.డీ అలీవుద్దీన్, కొండా రాజు, బండ రాజ తదితరులను నియమించారు.

## తెలంగాణ సంప్రదాయాలపై అవగాహన ఉండాలి

**కాచిగూడ:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులు, యువత అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని చైతన్య హబ్ జూనియర్ కాలేజ్ చైర్మన్ వి.వి.హనుమంతరావు అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని కళాశాలలో బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి రంగు రంగుల తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి, పాడి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ హనుమంతరావు మహిళా అధ్యాపకులను, విద్యార్థినీలను అభినందించి బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో నూతన ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** ఆర్టీసీ సంస్థలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్‌టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంఏ రహమాన్, ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులకు ఆసరా పెన్షన్స్, తెల్లరేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొత్తగా ఏర్పడిన కార్యవర్గాన్ని వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు యాదగిరి, గౌరవ అధ్యక్షులు కె.ఆనందం, బీవీ కోటయ్య, అంజన్నగౌడ్, సత్యనారాయణచారి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లోర్ కర్లింగ్ పోటీల్లో తెలంగాణకు రజత, కాంస్య పతకాలు


నేషనల్ ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో వంసత మాధురి తదితరులు

**కాచిగూడ:** పుదుచ్చేరిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరిగిన 3వ నేషనల్ ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో తెలంగాణ నుంచి మిక్స్‌డ్ డబుల్స్‌లో పాల్గొన్న వి.వసంత మాధురి, అనుదీప్‌రెడ్డి కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ రొయ్యూరు సురేష్ వారికి అభినందనలు తెలిపారు. సీనియర్ ఉమెన్స్ విభాగంలో పాల్గొన్న వి.వసంత మాధురి, ఎం.నాగ అక్షయ, ఎం.లక్ష్మీ చైతన్య, మేజర్ పద్మజ రజత పతకాలు సాధించారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి సీఎం ఎన్.రంగస్వామి క్రీడాకారులను సత్కరించారు.